మినీకథ

# పోరాటం

టి.ఆర్.కె.రావ్

"టికెట్ ప్లీజ్!"

"అమ్మాయ్ నిన్నే!"

"మాట్లాడవేం టికెట్ ఉందా లేదా, యింతకీ."

"ఎక్కడికి వెళ్ళాలి."

"ఏం అమ్మా, మాట్లాడకపోతే ఎలాగ! మిగిలిన ప్రయాణికుల టికెట్లు కూడా చెక్ చెయ్యాలికదా!"



"ఇంటి దగ్గర అమ్మ నాన్నతో దెబ్బలాడి పారిపోయి వచ్చావా?"

"ఇంతకీ ఏ వూరు?"

"టిక్కెట్టు కొనడానికి వ్యవధి లేక ఆఖరిక్షణంలో ట్రెయిన్ యెక్కేవా?"

"చూడడానికి అమాయకురాలా వున్నావు ఎక్కడికి వెళ్ళాలో చెబితే యెంత ఛార్జియో చెబుతాను డబ్బు యిస్తే టిక్కెట్ వ్రాసియిస్తాను"

"ఇంతకీ డబ్బు ఉందా. లేదా?"

"నేనింతలా గింజుకుని గీపెట్టినా నోరు మెదపకపోతే యెలాగమ్మా."

"అగేజీ యేమీ వున్నట్టులేదే, కట్టుబట్టలతో బయలుదేరావా?"

"అవునవును — నిన్ననేగా పరీక్షా ఫలితాలు వచ్చాయి ఏం పరీక్షపోయిందా? ఫరవాలేదమ్మా పరీక్షకు వెళ్ళిన వాళ్ళంతరూ ఎక్కడ ప్యాసవుతారుచెప్పు. ప్యాసయినా ఈ జీవితం అనే పరీక్షలో పోరాటంతప్ప గెలుపు, ఓటములు లేవమ్మా! గెలవడమంటే ఏమిటో తెలుసా? విసిగిపోయి, అలసిపోయి ఓడిపోవడం అయినా నువ్వు యింకా చిన్నపిల్లవి. ఇవన్నీ నీకు యెక్కడ బోధపడతాయిలే. చూడమ్మా నా వృత్తి ధర్మం గురించి ఏదో వేదాంతం మాట్లాడుతున్నాను మిగిలిన ప్రయాణీకులు నిన్ను, నన్ను యెలా చూస్తున్నారో చూడు- ఎక్కడికి వెళ్ళాలో త్వరగా చెప్పమ్మా."

"నీ వాలకం చూస్తూంటే జైలుకి వెళ్ళడానికే నిశ్చయించుకున్నట్టున్నావు. సరే నీ ఖర్మ. నేనేం చేస్తాను ఈ రోజుల్లో జాలిపడి లాభంలేదు వచ్చే స్టేషన్‌లో నా డ్యూటీ అయిపోతుంది. నా హెడ్ క్వార్టర్స్ అక్కడే. నిన్ను స్టేషన్‌లో అప్పచెప్పేస్తాను. తరువాత నువ్వు యేం చేసుకుంటావో నీ యిష్టం."

"పద— బండి దిగు. దిగుతావా పోలీసుల్ని పిలవమంటావా?"

"ఇందాకటినుంచి పోనీకదా అంటే ఏమిటి ఆ మొండితనం."

"నేను వాగడమే తప్ప నువ్వు మాట్లాడవు- పైగా ఏడుపుకూడానా!"

"ఏమిటి! నువ్వు మూగదానివా? ముందే యెందుకు చెప్పలేదు."

"అయ్యో. భగవంతుడా. యింత అందాల రాశి. అపురూపవతికి మాటలు రావా?"

"నీకు ఎవ్వరూ లేరా? ఎందుకలా అనుకుంటావ్? నేనున్నాను. నా యింటికి తీసుకు వెళతా. ఈరోజునుంచి నువ్వు నా కూతురివి"

"భగవంతుడు ఈ విధంగా నాకు ఆడపిల్లని ప్రసాదించాడనుకుంటా!"

"ఇవాళనుంచి నీపేరు ఏమిటో తెలుసా? పద్మ."

"ప్రసాద్ ఎవరు వచ్చారో చూడు(?) నీకు చెల్లాయిని తీసుకువచ్చానురా! పేరు తెలుసా? పద్మ. ఈ రోజునుంచి నీకు పద్మ తోడు, పద్మకి నీవు తోడు.

"అవునమ్మా పద్మా. ప్రసాద్‌కి దృష్టి లేదు. పుట్టుకతోనే అంధుడు. వాడికి తల్లీ, తండ్రి అన్నీ నేనే. ఈ రోజు నుంచి నీకు కూడా!"

## కావాలి

కావాలి.. కావాలి
నువ్వు కావాలి.. నీ నవ్వు కావాలి
నీ మనసు కావాలి.. నీ మనసు కావాలి
నీ కనుపాప కావాలి.. నీతో నా మనసు
కావాలి
నువ్వు లేక.. నీ నవ్వు లేక
నేను కాలేను.. మనిషిని కాలేను
నేను రాలేను.. నీదరి చేరలేను.

—సుధాకర్